# మూడో అమావాస్య

## ఎస్. అష్ఫల్

**ఈ వారం కొత్త స్నేహ సంబంధాలు ఏర్పడతాయి. ఆదాయం సామాన్యంగా వుంటుంది. ప్రయాణాలు అనుకూలిస్తాయి. తొందరబాటు నిర్ణయాల వలన కష్టాల్లో పడతారు!**

వారఫలాలు చదువుతూ ఇల్లు చేరాను. గుమ్మంలో అడుగు పెట్టగానే నా భార్య చెప్పటం ప్రారంభించింది–

"మన ప్రక్క వాటాలో ఎవరో భార్య భర్త అద్దెకొచ్చారండి.... మనలా వాళ్లకి పిల్లా జల్లా లేరు... సామాను కూడా పెద్దగా లేదు.... వ్యాపారం గురించి హైదరాబాద్ నుంచి వచ్చారట!"

వీక్లీ టేబుల్ మీద పెట్టి షర్ట్ గుండీలు విప్పుతూ వింటున్నాను. ఓ క్షణం ఆగి మళ్ళీ ప్రారంభించింది.

"అతని పేరు డేవిడ్, అతని భార్య నిషా.... చూడ ముచ్చటైన జంట వాళ్ళది!"

"అంతేనా! ఇంక ఏమయినా వుందా?!... ముందు స్నానానికి నీళ్ళు పెట్టు.... స్నానం, భోజనం అయిన తరువాత నువ్వు సేకరించిన వివరాలు అన్ని చెబుదువుగాని!" విసుగ్గా అన్నాను.

ఇక మారుమాట మాట్లాడకుండా తన పనిలో నిమగ్నమయింది.

స్నానం, భోజనం చేశాక ఆరుబయట కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని ఉన్న నాకు ఏదో పెద్ద శబ్దం వినిపించింది. తల తిప్పి చూశాను. మా ప్రక్క వాటాలో భార్య భర్త మధ్య ఘర్షణలా అనిపించింది. పరీక్షగా చూశాను. ఆమె చేతులు, కాళ్ళు వంకర్లు పోతున్నాయి. కళ్ళు పెద్దవిగా తెల్లగుడ్లు మాత్రమే కనబడు తున్నాయి.... నాలుక కుక్క నాలుకలా బయటకు వ్రేలాడుతుంది....

జాకెట్ మీద నుంచి చీర తొలగిపోయి ఆమె రొమ్ములు ఎగిరిపడు తున్నాయి.... అతను గాజు గ్లాసులో రక్తం లాంటి ఎర్రని ద్రవాన్ని ఆమె పెదాలకు అందిస్తున్నాడు. కాని ఆమె వణకడం వలన ఆ ద్రవం దరిదాపు సగం శరీరం మీద వలిగిపోతుంది.

అప్రయత్నంగానే లేచి అటు వెళ్లాను.

"సార్! వెళ్లిపొండి, చూస్తే భయపడతారు.... ప్లీజ్!" అన్నాడతను.

నాకేమీ అర్థం కాలేదు. వచ్చి కుర్చీలో కూర్చుండి పోయాను. ఆ సంఘటన ఇంతకు ముందు ఎప్పుడూ తటస్థపడ లేదు. ఎప్పుడూ ఎవరినోటా వినలేదు! ఆలోచిస్తూ ఆకాశంలో చుక్కల వంక చూస్తూ ఉండిపోయాను.

"సార్! మీ కాళ్ళు పట్టుకుంటాను... ఇప్పుడు చూసింది ఎవరికి చెప్పకండి... ఆమెకు దెయ్యం పట్టిందని తెలిస్తే ఈ వాడకట్టు నుంచి తరిమికొడతారు!... ప్లీజ్!!" అంటూ దరిదాపుగా ఏడుపు స్వరంతో నా దగ్గరికొచ్చాడు డేవిడ్.

"ఫర్వాలేదు! మీరు కంగారు పడకండి... అలాంటి పని ఏదీ జరగదు!" అన్నాను. ఆ మాటలు నాకు తెలియకుండానే అనేశాను

"థాంక్స్!"

"ఇలా కూర్చోండి!" కుర్చీ చూపించాను.

"సార్! మిమ్మల్ని చూస్తే ఆప్తుల్లా వున్నారు... నేను ఈ విషయంలో సహాయం చేస్తే మీ ఋణం మళ్లీ జన్మలో తీర్చుకుంటాను..."

"చెప్పండి...!"

"సార్, నా భార్య నిషాకు ఓ దెయ్యం పట్టుకుంది. ఇప్పటికి రెండు అమావాస్యలు గడిచాయి. రేపటిది మూడో అమావాస్య....' అన్నాడు.

"భూత వైద్యుడికి చూపించారా?!" అడిగాను.

"నాకు చేతనయిన ప్రయత్నాలన్నీ చేశాను... లాభం లేకపోయింది."

"ఇప్పుడెలా వుంది ఆమెకి?"

"ఓ గ్లాసు పచ్చి రక్తం. కాస్త పచ్చి మాంసం... వెంట్రుకలు... బొగ్గు తినిపించాను.... కాస్త శాంతించింది!"

ఆ మాటలకు నా వళ్ళు జలదరించింది.

"మీరు ఏం వ్యాపారం చేస్తుంటారు?" అడిగాను సబ్జక్ట్ మారుస్తూ.

"సార్! నా పూర్తి కథ చెబుతాను.... నేను హైదరాబాద్‌లో జనరల్ హాస్పిటల్‌లో సీనియర్ డాక్టర్ని. మెడ్రాస్ యూనివర్శిటీలో ఎం. బి. బి. ఎస్. చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టాను. అప్పుడు స్టేట్ హెల్త్ మినిష్టర్ నా భార్య దగ్గర బంధువు కావటం వలన నాకు మంచి రికమండేషన్ దొరికింది. అలా ప్రైవేట్ నుంచి గవర్నమెంట్ సర్వీస్‌లో ప్రవేశించాను. కొద్ది కాలంలో నే సీనియార్టి లిస్టులో పడ్డాను. మా జీవితం చాలా ఆనందంగా గడిచే రోజులవి... ఇంతలో విధి మా మీద పగబట్టింది –ఓ రోజు ఉదయం నా ఇంటి ముందు పోలీస్ జీపు ఆగింది. జీపులో వచ్చిన ఎస్. పి. నా చిన్ననాటి స్నేహితుడే. ఎస్. పి. రావ్ హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయి రెండు నెలలయినా అతన్ని పెర్సనల్‌గా కలుసుకోవడం పడలేదు. తిన్నగా అతనే నా ఇంటికి రావడం చాలా ఆనందమనిపించింది. నిషాను అతనికి పరిచయం చేద్దామనుకున్నాను. కాని ఎస్. పి. రావ్ నా చేతికిచ్చిన కాగితం చదివి వెంటనే అంబులెన్స్ పంపమని ఫోన్ చేసి జీపులో ఎక్కి కూర్చున్నాడు. రావ్ మా హాస్పటల్‌కు వెళ్లి సూపర్నెంట్ చేత వ్రాయించి మరీ తెచ్చాడు. సామాన్యంగా నాకు పోస్టుమార్టం డ్యూటీ వుండదు. మిగిలిన డాక్టర్స్ ఖాళీగా లేనపుడు మాత్రమే పి. ఎం. రూమ్‌లోకి వెళతాను. జీపు సిటీ దాటి స్మశానం వైపు వెళుతుంది. జీపు వెనుక అంబులెన్స్ ఫాలో అవుతుంది ఎస్. పి. రావ్ నాతో చెప్పడాన్కి సంశయిస్తున్నాడని గమనించి "రావ్! ఆ అమ్మాయి నీకు దగ్గర బంధువా?" అడిగాను. "కాదు! ఈ మధ్యనే రిక్రూట్ అయిన క్రైంబ్రాంచ్ ఎస్. పి. చెల్లెలు' చెప్పాడు. "కేసు వివరా లున్నాయా?" అడిగాను క్షణం ఆగి. "ఆ అమ్మాయి పేరు గంగ! సుమారు ఇరవై ఏళ్ళు. చనిపోయి మూడు నెలల ఆరు రోజులయ్యింది!" అన్నాడు. "ఎలా చనిపోయింది?" అతను ఫైల్లోంచి డూప్లికేట్ పోస్టుమార్టం రిపోర్ట్ తీసి నా చేతికిచ్చాడు

మహాభారతం ఎవరుఎవరికి చెప్పారు?
కార్డు మీద రాయండి!

దాంట్లో ఆమెది సహజమరణం అనిఉంది.అందుకు రిజన్స్ కూడా వ్యక్తం చేశారు. ఆమె విషం లాంటిది త్రాగిఉంటే కళ్ళల్లో ఎర్రటి జీరలు వుండాలి. అవి లేవు. జీర్ణాశయంలో గాని, ప్రేవుల్లోగాని ఎలాంటి విషపదార్థాలు లేవు.... ఇలా చాలా రిజన్స్ వ్రాయబడి వున్నాయి. ఆ కాగితం రావ్‌కి ఇస్తూ "ఇప్పుడు పోస్ట్‌మార్టం అవసరంఎందుకొచ్చిందో తెలుసుకో వచ్చునా?" అడిగాను. రావ్ పోలీస్ బుద్ధి చూపించాడు. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

స్మశానానికి పది గజాల దూరంగా జీపు ఆగింది. జీపు దిగి ముందుకి నడిచాము. రావ్ ఫైల్లోంచి ప్లాను కాగితం తీసి దాని ప్రకారం మెటల్ టేపుతో కొలిచి రెండు సమాధుల మధ్య దీర్ఘ చతురస్రంగా సున్నంతో మార్కు వేయించాడు. "ఇక్కడ ఆమెను సమాధి చేసింది!" చెప్పాడు. మాతో వచ్చిన పనివాళ్ళు త్రవ్వడం ప్రారంభించారు. మూడు నెలలు దాటింది కనుక అస్థిపంజరంలో ఎముకలన్ని జాయింట్స్ వదిలేసి ఉండవచ్చు. లేదా కొన్ని పరిస్థితులలో అస్థిపంజరానికి సన్నటి మాంసం పొర అక్కడక్కడా మిగిలి ఉండవచ్చు. వాళ్ళు ఆరు అంగుళాల మట్టిని తొలగించేసరికి పైభాగానున్న గడ్డి, పిచ్చి మొక్కలు వేళ్ళతో పెగల్చ బడ్డాయి. వాళ్ళని ఓసారి ఆగమని చెప్పి అక్కడ మట్టిని ఓ బాటిల్లో నింపాను. మళ్ళీ వాళ్ళు త్రవ్వడం ప్రారంభించారు. సుమారు మూడు అడుగులు లోతు త్రవ్విన తరువాత మట్టి రంగు మారింది... కాస్త చెమ్మ కూడా వుంది. వాళ్ళు అంతవరకు ఉపయోగించిన పార, పలుగు లాంటివి ప్రక్కన పెట్టి చేతులతో మట్టిని తొలగించసాగారు. శవం





## మూడో అమావాస్య

తాలూకు తల వెంట్రుకలు బయటపడ్డాయి. అవి తలనుంచి విడిపోయి ఉండడం వలన మట్టితో సులభంగా బయట కొచ్చేశాయి. రెండు నిమిషాలకు ఛాతీ ఎముకలు... కుడికాలు బొటనవ్రేలు ఎముక బయట పడ్డాయి. ఆ సమయంలో నేను లోనికి దిగి చేతి గ్లౌజులు పైవరకు లాగి మరోసారి మట్టిని బాటిల్లో నింపాను. శవాన్ని జాగ్రత్తగా బయటకు తీసే ఉపాయాలు చాలా వున్నాయి. కాని అస్థిపంజరాన్ని త్రవ్వి తీసిన కేసులు అరుదు. కనుక నా చూపు రెప్పార్పకుండా పనిలో లగ్నమైనాయి. అస్థిపంజరం పూర్తిగా బయటపడింది కాని.... పుర్రె కనిపించ లేదు...! ఆశ్చర్యం! మా మొహాల్లో జీవంలేనట్లు చూస్తూ ఉండిపోయాం. "మరో మీటరు సర్కిల్లో సెర్చ్ చేస్తే?" అడిగాడు రావ్. "నో! అలా జరగటానికి వీల్లేదు!" చెప్పాను. ఐదు నిమిషాలు ఆలోచనలతో నా తల వేడెక్కింది. నా సర్వీస్‌లో ఇలాంటి సమస్య ఎప్పుడూ ఎదుర్కో లేదు.




"మిస్టర్ రావ్! నాకు ఈ కేసు పూర్తి డీటైల్స్ కావాలి!.... పుర్రెలేని అస్థిపంజరాన్ని పోస్ట్ మార్టమ్‌కు ఎలా ఎలవ్ చేయను?... సమ్‌థింగ్ ఈజ్ రాంగ్!" అన్నాను.

"డేవిడ్! హైద్రాబాద్ సిటీ అంతా ఇప్పటికే ఈ గంగ పేరు పాకేసింది. ప్రజలు భయాందోళనలతో ఊరు విడిచి పారిపోతున్నారు. ఈ మధ్య ప్రతీ ఇంటి తలుపు మీద 'ఓ స్త్రీ రేపురా!' అని వ్రాసి ఉండడం గమనించలేదా?? రోజూ సిటీలో ఎన్నో ఏక్సిడెంట్స్ జరగడానికి ఈమే కారణం.... నిన్నటికి నిన్న ఆబిడ్స్ సెంటర్‌లో సిగ్నల్ లైట్స్ అన్నీ గ్రీన్‌గా వెలగడం ప్రారంభించాయి. ఆ కొద్ది సమయంలో సుమారు పది ప్రాణాలు పోయాయి... బహుశ టెక్నికల్ డిఫెక్టని ఎలక్ట్రీషియన్‌ను సస్పెండ్ చేసింది డిపార్ట్‌మెంట్. కాని నూటికి నూరు పాళ్ళు ఇది దెయ్యం గంగ పనే!" అన్నాడు రావ్. నేను నమ్మలేదు. ఇప్పటికీ దెయ్యాలు.... భూతాలు అనే పదాల్ని వాడడం మన సైన్సును అవమాన పరచినట్లే అనుకుంటా! కాని వెస్టర్న్ కంట్రీస్‌లో డెవిల్స్ ఉన్నాయట. "మిస్టర్ రావ్ ఐ వాంట్ ది ఫ్యాక్ట్!" అన్నాను. అతను నా వంక పిచ్చివాడ్ని చూసినట్టు చూశాడు. "ఐతే దీని స్కల్ ఏదీ?!.... చెప్పండి!" అన్నాడు. అప్పటికే చుట్టూ మట్టిని చేతులతో పెగిల్చి చూశారు. కాని ఆ పుర్రె జాడ లేదు. నాకు గంగను గురించి తెలుసుకోవాలని ఆత్రుత పెరిగింది. ఆ అస్థిపంజరాన్ని అంబులెన్సులో హాస్పిటల్‌కు తెచ్చాము. జరిగిందంతా సూపెర్నెంట్‌కు వివరించాను. "ఈ మధ్య ఓ లోకల్ పేపర్‌లో చూశాను గంగ అనే దెయ్యం ఆవహించి మహిళ మృతి చెందిందని!" అన్న సూపర్నెంట్ మాటలు నా చెవుల్లో పిస్తోలు గుళ్ళలా మారు మ్రోగాయి.

"అస్థిపంజరం తెచ్చాను!" అని ఆయనతో చెప్పాను. ఆయనలో ఏదో తత్తరపాటు.... ఆందోళన.... "కీపిట్ దేర్!" అన్నారు వెంటనే. రావ్ ఆయన కంగారు చూసి "సార్! పబ్లిక్ చాలా ఆందోళన పడుతున్నారు..... మనం ఈ ప్రాబ్లమ్ వెంటనే సాల్వ్ చేయాలి!" వినయంగా చెప్పాడు రావ్. "నిజమేనయ్యా, ఇది జబ్బయితే మెడిసిన్ ఇవ్వగలం! కాని... ఇది డెవిల్ ఏ సమయంలో ఏ పరిణామం జరుగుతుందో ఎవరికి తెలుసు?" అన్నారు సూపర్నెంట్. "సార్.... మీరూ డెవిల్స్‌నే నమ్ముతారా?" అన్నాను. "డేవిడ్! ఇంతకు ముందు ఎన్నడూ నమ్మలేదు... కాని గంగ మరణం తరువాత నమ్ముతున్నాను!" అన్నారు. నాకు ఆశ్చర్యం కలిగింది.

అంబులెన్స్‌లో నే అస్థిపంజరం ఉంది. రావ్ నేను సూపర్నెంట్ గారితో కలసి ఆయన రూమ్ వైపు నడుస్తుండగా అంబులెన్స్ గేటులోంచి బయటకు వెళ్లడం గమనించి "ఎక్కడికి అంబులెన్స్!" అడిగాను రావ్‌ని. ఇంతలో డ్రైవరు పరుగున మా వైపు వస్తూ "సార్ బండి దానంతట అది వెళ్లిపోతుంది...." అరిచాడు. రావ్, నేనూ పరుగున వెళ్ళి జీపు ఎక్కాము. అప్పటికే అంబులెన్స్ మెయిన్ రోడ్ ఎక్కింది. అరవైకిలో మీటర్ల వేగంతో దాన్ని ఫాలో అయ్యాము. రోడ్ మీద జనం ఆశ్చర్యంగా చూస్తూ స్థంభాల్లా నిలబడి పోయారు. మా జీపులో ఉన్న లౌడ్ స్పీకర్ ఆన్ చేసి రావ్ పురజనానికి హెచ్చరిక చెబుతూ డ్రైవ్ చేస్తున్నాడు. అప్పటికే దరిదాపు జనసంచారం స్థంభించిపోయింది. తమాషా చూడ్డానికి జనం డాబాలు, మేడలు, పెంకుటిళ్ళు, రోడ్‌పక్క ఉన్న చెట్లపైకి ఎక్కేసారు. రావ్ ముందు జాగ్రత్త కోసం వైర్‌లెస్ మెసేజ్ అన్ని స్టేషన్స్‌కి అందించేశాడు. అంబులెన్స్‌లో అస్థిపంజరం ఎగిరెగిరి పడుతుంది... కొంత సేపటికి అంబులెన్స్ ఓ పెద్ద బంగ్లా ముందు ఆగింది.

ఆ బంగ్లాలో ఎవరూ ఉన్నట్లుగా లేదు. కొత్త బంగ్లా అయినా ఇంటి ముందు చనిపోయిన పూలమొక్కలు, బాగా ఎదిగి ఉన్న లాన్‌లో గడ్డి, తుప్పుపట్టి బిగుసుకు పోయిన గేటు!

జీపు ప్రక్కగా ఆపి అంబులెన్స్‌లోకి తొంగి చూశాము. అస్థిపంజరం మామూలుగానే ఉంది.

బంగ్లా గేటు గట్టిగా నెట్టి లోపలికి నడిచాము. తలుపుకు పెద్ద తాళం వేలాడుతోంది. కిటికీ గాజు రెక్కలు మసగ్గా దుమ్ము పట్టి ఉన్నాయి. గాలికి ఓరగా తెరుచుకొని ఉన్న కిటికీ రెక్కను తన లాఠీతో నెట్టాడు. "డేవిడ్! ఇలా చూడు...." అంటూ లాఠీ అటు చూపించాడు. నా కళ్లను నేను నమ్మలేక పోయాను. ఆ గదిలో సోఫా పైన ఉంది ఓ పుర్రె!.... అది గంగ తాలూకు పుర్రె అని నమ్మకం కుదిరిపోయింది. కాని దాన్ని పూర్తిగా పరీక్ష చేస్తేగాని రిపోర్ట్ వ్రాయడం కుదరదు.

రావ్ వెంటనే ఆ చుట్టు పక్కల ప్రాంతమంతా మంచి బందోబస్తు ఏర్పాటు చేశాడు. ప్రజలు భయపడకుండా జరిగిన సంఘటనను మరో విధంగా ప్రజలను మభ్యపెట్టాడు. గ్రేట్ హిప్నటిస్ట్ నాగరాజుగారు అంబులెన్స్‌ను డ్రైవ్ చేసి విచిత్రాలు చూపించారని పుకారు పుట్టించాడు.

నన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేయడాన్కి జీపులో వచ్చాడు రావ్. దారిలో అతను గంగను గురించి తనకు తెలిసిన విషయాలు చెప్పాడు. గంగ చాలా అందమైన అమ్మాయి. తను ఓ అబ్బాయి ప్రేమలో పడి కాలు జారింది. ఎబార్షన్ కోసం ఓ డాక్టర్ దగ్గరకు వెళ్లింది. ఆ డాక్టరు ఆమెకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆమెను నగ్నంగా వీడియో కేసెట్ తీసుకున్నాడు. ఆమెకు తెలియకుండా వీడియో కెమెరా ఓ గదిలో ఏరేంజ్ చేసి ఆ గదిలో ఆమెకు ఎబార్షన్ చేశాడు. గంగకు ఈ విషయాలు తెలియవు. తన కుటుంబ సభ్యులకు ఎవరికి తెలియకుండా ఎబార్షన్ అయినందుకు చాలా సంతోషపడింది. కాని తన ప్రియుడు అప్పటికే దుబాయ్

పారిపోయాడని తెలిసి కుమిలి పోయింది. కొంత కాలానికి గంగ ప్రియుడ్ని మరిచిపోయింది. మరో వ్యక్తిని పెళ్ళి చేసుకొని లక్షణంగా కాపురం చేసుకుంటుండగా ఓ రహస్య వీడియో సెంటర్ వాళ్ళు ప్రదర్శించిన గంగ బ్లూ ఫిలిం, ఎబార్షన్ ఫ్యాక్ట్స్ తన భర్త కళ్ళారా చూశాడు. ఆ రోజు నుంచి భార్యను వేధించ సాగాడు. ఓ రాత్రి గంగ హఠాత్తుగా మాయమయింది. మూడు రోజుల తరువాత డాక్టరు ఖూనీ చేయబడ్డాడు. ఆ రోజు సాయంత్రం గంగ శవం నడివీధిలో దొరికింది. ఆ డాక్టర్ బంగ్లాయే ఇప్పుడు పురి ఉన్న బంగ్లా!

జీపు మా ఇంటి ముందు ఆగింది. ఎస్. పి. రావ్‌ను ఇంట్లోకి ఆహ్వానించాను. నిషాను పరిచయం చేశాను. నిషా మాకు రెండు కప్పుల్లో టీ ఇస్తూ "ఇంతకు ముందు ఎవరో పిచ్చి పిల్ల వచ్చింది.... టీ ఇచ్చాను.... ఆ పిల్ల ఓ కప్పు రక్తం ఇవ్వండి!' అంది...." అంటూ ఇంకా ఏదో చెప్ప బోయింది."ఎవరూ? ఎలా వుంది?" అడిగాను కంగారుగా. "పేరు గంగ?...." అంది నిషా. నా నెత్తి మీద పిడుగు పడినట్లు అయింది. రావ్ కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు. ఓ నిమిషం తరువాత రావ్, నేనూ లాన్‌లోకి దూరంగ వెళ్ళి ఇప్పుడు ఏం చేయాలని ఆలోచించ సాగాము. "పాత బస్తీలో దాదాభాయ్ అని ఓ భూత వైద్యుడున్నాడు. ఒకసారి అతన్ని కలుసుకుందాం!" చెప్పాడు రావ్. హుటాహుటిన బయలుదేరాం. మాతో పాటు నిషా కూడా వుండడం మంచిదని భావించి ఆమెను కూడా తీసుకు వెళ్ళాము.

దాదాభాయ్ నివశించే ప్రాంతం చాలా ఇరుకుగాను, రొచ్చుగాను ఉంది. పెంకుటిల్లు కప్పు కూలిపోయివుంది. నీడకోసం సిమెంట్ సంచులతో కుట్టిన డేరా... గోడలు సిమెంట్ పూత పోయి ఇటుకలు బయటబడి ఉన్నాయి. వీధికుక్కలు మొరగడంతో ఎవరో ముసలివాడు బయటకు వచ్చాడు. "దాదాభాయ్ ఇల్లు ఎక్కడ!" అని అడిగాడు రావ్. ఆ ఇల్లు దాదాభాయ్‌దని తనకు తెలుసు. "బాబు! కుచ్ ఖాస్ బాత్..." అన్నాడు ఆ ముసలాడు. "జీ హా!" చెప్పాడు రావ్. ముసలాడు రెండడుగులు ముందుకేసి హిందీలో నే చెప్పాడు దాదాభాయ్ స్మశానానికి వెళ్ళాడని, ప్రతి అమావాస్య అతను క్షుద్రశక్తులను కలుసుకో డానికి మాంసము, రక్తము, వెంట్రుకలు లాంటివి తీసుకువెళ్ళి వాటికి విందు చేస్తాడని.

తిరుగు ప్రయాణంలో రావ్ క్వార్టర్స్ దగ్గర ఆగిపోయాడు. నేనూ నిషా ఇంటికి చేరుకున్నాం.

నిషా భోజనం దగ్గర చెప్పింది "గైనకాలజిస్ట్ సుజాత నా గర్భంలో పెరుగుతున్నది మగబిడ్డ అని చెప్పింది. రెస్ట్ ఎక్కువ తీసుకోమని సలహా ఇచ్చిందండి!" అంది. నాకు నిషా మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి. నా ఆలోచనలు గంగ దెయ్యంగా ఎలా మారిందని?

రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో నిషా నిద్రనుంచి లేచింది. నాకు ఇంకా నిద్ర పట్టలేదు. ఆమె బాత్‌రూమ్‌లోకి వెళ్ళి పది నిమిషాల తరువాత వచ్చింది. ఆమె పాదాలకు రక్తం చూసి కంగారుగా మంచం మీద లేచి కూర్చున్నాను. కాళ్ళను పరీక్షగా చూశాను. ఎర్రని రక్తం. వెంటనే డాక్టర్ సుజాతకు ఫోన్ రింగ్ చేసి చెప్పాను. మరో పది నిమిషాల్లో సుజాత వచ్చి టెస్ట్ చేసి చెప్పింది. ఎబార్షన్ అయిందని? మాట విని నిషా స్పృహ తప్పింది.

ఆ రాత్రి చాలా కష్టంగా గడిచింది. నా వైద్య వృత్తి నా భార్యను కాపాడ గలదని నమ్మకం కోల్పోయాను. దేవుడి మీద భారం వేశాను.

ఉదయం ఎస్. పి. రావ్‌ను ఫోన్లో కలసి జరిగిందంతా చెప్పాను.

దాదాభాయ్‌ను వెంట పెట్టుకొని నా ఇంటికి వచ్చాడు. దాదాభాయ్ నిషా మొహంలోకి చూస్తూ "దెయ్యం ఆవహించి ఇరవై నాలుగు గంటలయింది, నిన్న అమావాస్య కదా?!.... నిన్నటి రోజున ఆమె అస్థిపంజరాన్ని బయటకు తీయడం మొదటి పొరబాటు!' అన్నాడు. "దాదాభాయ్! నా భార్యను రక్షించు ఎంత డబ్బయినా ఖర్చు చేస్తాను?" అని వేడుకున్నాను. "చూడండి డాక్టర్ సాబ్? గంగ చాలా బద్మాష్ షైతాన్! ఇప్పటికి ఇరవై గర్భాల్లో పిండాల్ని ఖతమ్ చేసింది!' చెప్పాడు. "దాదాభాయ్ మా మందుల మీద నమ్మకం లేదు. నువ్వు కాదంటే నా భార్య ఏమయిపోతుంది?! ప్లీజ్!" ఏడ్చాను. అతను నా భుజం తడుతూ "ఘిరు డాక్టర్ కదా! మీకు మంచి ఆరోగ్య వంతుడి బ్లడ్ దొరికితే ఓ బాటిల్‌లో రెడీగా ఉంచుకోండి! మీ భార్యగారు ఆయాసంగా రొప్పుతూ, కాళ్ళూ, చేతులు వంకర్లు తిరుగుతాయి.... ఆ సమయంలో ఆమెకు ఓ కప్ బ్లడ్ త్రాగించండి!... దెయ్యం శాంతిస్తుంది!" అని చెప్పాడు.

అతను చెప్పిన విధంగా అలా చేస్తూ నిషాను కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చాను.

ఓ నెల గడిచింది. అమావాస్య దగ్గర పడింది. భయంతో దాదాభాయ్‌ను సలహా అడిగాను. అతను చెప్పిన విధంగా ఆ రాత్రి నా ఇంట్లో విందు ఏర్పాటు చేశాను. నా బంధు మిత్రులందర్ని ఆహ్వానించాను. ఇంటిని విద్యుత్ దీపాలతో అలంకరించాను. చీకటి అనేది కనబడకుండా చేశాను. విందు భోజనాల తరువాత తెల్లవారే వరకు డాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశాను. కాని... ఆ రాత్రి వచ్చిన వాళ్ళలో ఇద్దరు గర్భిణీ స్త్రీలున్నారు. వాళ్ళను గురించి నాకు ముందుగా ఆలోచన లేదు.

రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో భోజనాలు పూర్తి చేసుకొని లాన్‌లో విశ్రాంతిగా కూర్చున్న ఓ స్త్రీ క్రింద పడి దొర్లడం ప్రారంభించింది. ఆమె కట్టుకున్న తెల్ల చీర రక్తంతో ఎర్రగా మారింది. ఆమె ప్రెగ్నెంట్ అని ఎవరో చెప్పారు. ఆమెకు ఎబార్షన్ అయింది.

మరో అరగంట తరువాత ఇదే విధంగా మరో స్త్రీకి ఎబార్షన్ అయింది. విందుకు హాజరైన ఇద్దరు గర్భిణీ స్త్రీలకు ఇలా జరగడంతో అందరికి అనుమానం వచ్చింది. ఒక్కొక్కరూ నెమ్మదిగా జారుకున్నారు. నా భార్య, నేను మాత్రమే మిగిలాము.

ఉదయం దాదాభాయ్ స్మశానం నుంచి తిన్నగా నా ఇంటికి వచ్చాడు. అతని మొహం చూసి త్రుళ్ళి పడ్డాను. మొహం నిండా రక్తం.... లోతైన గాయాలు ఉన్నాయి. "డాక్టర్ సాబ్! రాత్రి గంగను స్మశానం నుంచి బయటకు రాకుండా చాలా ప్రయత్నించాను. కాని ఆమె నన్ను రక్కి, నాపై కలబడి, నన్ను వదిలించుకొని వచ్చింది. ఆమె వెంట ఓ ఆరు నెలల పిండం, మరో ఏడు నెలల పిండాన్ని తెచ్చుకుంది!... ఆమె వంద గర్భాల్లో పిండాన్ని తినే వరకు విశ్రమించదు!" అన్నాడు దాదాభాయ్.

"దాదాభాయ్! నా భార్యకు ప్రమాదం లేదుకదా?" అడిగాను. "సాబ్! రెండు అమావాస్యలు

## పూనమ్ వ్యాపారం



పూనమ్‌కు సినిమాలు కరువు అవటంతో వ్యాపారంలో పడిందట. నటీనటుల మేకప్‌కు సంబంధించిన అన్ని అట్టహాసాలతో ఒక వ్యాన్‌ను నడుపుతోంది పూనమ్. షూటింగ్‌లు జరిగే లొకేషన్సుకు ఈ వ్యాన్‌ను పంపిస్తుంటుందట. ఇటీవలే ఈ వ్యాన్‌కు అనిల్‌కపూర్, శ్రీదేవి ప్రారంభోత్సవం జరిపారు. ఈ కొత్త వ్యాపారంలో దిగి పూనమ్ చేతులు కాల్చుకోదుకదా! అని పెద్దలు అనుకుంటున్నారు. మొగుడి డబ్బులేగా పోతే అతనివే పోతాయి అని కొందరు సరిపెట్టు కుంటున్నారు. ఎలా వుంటుందో మరి పూనమ్ వ్యాపారం!

గడిచాయి.... మూడో అమావాస్య పెద్ద గండం!... ఊళ్ళో ఎక్కడా గర్భిణీ స్త్రీ అందుబాటులో దొరక్కపోతే నీ భార్యను చంపడం ఖాయం!ఎందుకైనా మంచిది నీ భార్యను తీసుకొని మరో ఊరు పారిపో!" అని సలహా ఇచ్చాడు. అందుకే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ఈ వూరు వచ్చాము!" అన్నాడు.

డేవిడ్ చెప్పిందంతా వింటూ వుంటే నాకు చెవుల్లోంచి ఆవిర్లు వస్తున్నాయి. నా భార్యకు ఆరో నెల గర్భం. గంగ దెయ్యం ప్రస్తుతం నిషాను ఆవహించి ఉంది. రేపు అమావాస్య! ఎలా? ఏం చేయాలి?! నా భార్యను కాపాడు కోవడం ఎలా?.. ఆలోచించ సాగాను

"సార్! మీరు ఈ రహస్యాన్ని బయట పెడితే...." అంటూ ఏదో చెప్పబోయాడు.

"డేవిడ్‌గారు! మీరు భయపడకండి! ఈ విషయం మీకు నాకు మాత్రమే తెలుసు.... నేను ఎవరికీ చెప్పను! అయినా చెప్పడం మరిచాను. రేపు ఉదయం ఫస్టు బస్‌కి నేనూ నా భార్య కాకినాడ వెళుతున్నాం!" అని చెప్పాను.

"సార్! మీరు కొండంత అండగా ఉన్నారనుకున్నాను. రేపు మీరు కూడా వుండరన్నమాట!" అన్నాడు.

"డేవిడ్‌గారూ! నాకూ ఉండాలనే ఉంది! కాని చాలా ముఖ్యమయిన పనుంది కనుక వెళ్ళక తప్పదు!" అని అబద్ధమాడాను.

## మూడో అమావాస్య

రెండు నిమిషాలు మౌనంగా కూర్చున్నాం.

గోడగడియారం మూడు గంటలు కొట్టింది.

"చాలా ట్రబుల్ ఇచ్చాను!... సారీ! వెళ్ళి పడుకోండి! ఎలా జరగాలని వ్రాసి వుందో అలా జరుగుతుంది!" అన్నాడతను.

రాత్రంతా డేవిడ్ చెప్పిన సంఘటనలు నా కళ్ళముందు తిరిగాయి. దారినపోయే దరిద్రాన్ని నెత్తిమీద పెట్టుకున్నాం! మనసు దిగులుతో భారమయింది

### గాయం

ప్రియా
నా హృదయాన్ని పువ్వును చేసి
దానిలో ప్రేమనే పరిమళాన్ని నింపి
నీకోసం దాచాను
ఒక్కసారి ఆ పరిమళాన్ని పీల్చి
సిగలో తురుముకుంటావని
మురిసిపోయాను! కాని
రెక్కలను త్రుంచి
నా హృదయాన్ని ముక్కలు చేసి
వీధిలోకి విసిరి వేస్తావని
ఊహించలేక పోయాను!

-దాసరి విజయభాస్కర్

ఉదయం ఐదు గంటలకే లేచి నా భార్యను తీసుకొని బస్టాండుకు వెళ్ళాను. అమావాస్య కావడం వలన కాబోలు బస్సు ఖాళీగా ఉంది. బస్సెక్కి కూర్చున్నాం. నా భార్యకు ఆ దెయ్యం విషయం చెప్పడం ఇష్టంలేదు. నిర్లిప్తభావంతో కూర్చున్నారు

* * * * *

వారం రోజుల తరువాత ఇంటికి తిరిగి వచ్చాము. రిక్షా దిగి రిక్షావాడికి డబ్బు ఇస్తుండగా "మన తలుపు తాళం పగిలి ఉందండి!" అంది నా భార్య

"డేవిడ్‌గారు!" పిలిచాను. ఎవరూ పలకలేదు.

నా చూపులు కిటికీలో ఉన్న చీటి మీద పడ్డాయి.

డియర్ పిచ్చి వెధవా!

దెయ్యం కథ చెప్పి బెదరకొడితే ఊరు విడిచి పారిపోతావని నాకు తెలుసు. నీ ఇల్లు దోచుకోవడాన్కి ఇది చిన్న నాటకం. నేను కథ చెబుతున్నంత సేపూ గుడ్లగూబలా చూస్తూ కూర్చున్నావు. నీకు ఏమాత్రం ఇంగితజ్ఞానమున్నా ఒకసారైనా నన్ను క్రాస్ చేసి "ఇలా ఎందుకు జరిగింది?!" అని అడిగి ఉండేవాడివి. నీ ఇంట్లో సామాన్లు ఒక్కటి కూడా విడిచి పెట్టలేదు. తల బాదుకోడాన్కి గోడలు మాత్రమే ఉన్నాయి. నేను వ్యాపారిని కాను, డాక్టర్ని అంతకన్నా కాను. నా నిజరూపం తెలిసింది కదా?!

ఇట్లు
నీ డేవిడ్. ○


